## వైద్యశిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 3 : నిర్మల్‌లోని జీఎన్ఆర్ కాలనీ వాసుల సౌకర్యార్థం స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్నా వెంటనే పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. ఆయన వెంట వైద్యులు శ్వేత, సిబ్బంది ఉన్నారు.

## వాహనదారులకు తప్పని తిప్పలు

ఖానాపూర్, సెప్టెంబర్ 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఖానాపూర్ రెంకొనివాగు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కోతకు గురి కాగా వాహనదారులు మంగళవారం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖానాపూర్-తర్లపాడు, ఖానాపూర్- దిలావర్‌పూర్ మార్గంలో నిర్మించిన తాత్కాలిక రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నష్టాన్ని తెలుసుకోవడానికి నిర్మల్‌కు వచ్చిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ కలిశారు. వర్షాలతో నియోజకవర్గంలో జరిగిన పంట నష్టం, ఇతర అంశాలను వివరించారు. అంతేగాకుండా పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ద్వారా ముంపునకు గురవుతున్న గుండేగాం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పునరావాస చర్యలు ప్రారంభించాలని కోరారు. అదే విధంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు విషయంపై చర్చించారు.

## నిర్మల్ జిల్లాలో ఐటీ పరిశ్రమను నెలకొల్పండి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 3 : నిర్మల్ జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో ఐటీ పరిశ్రమను నెలకొల్పాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఐటీ, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లయితే స్థానికంగా ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉంటాయని ఆదిశగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్, సభ్యులు పర్వేజ్ ఉన్నారు.

## ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి

దస్తురాబాద్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు డీఎల్‌పీవో రమేశ్ సూచించారు. మండలంలోని గోదావరి తీర ప్రాంతాలలో మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఎంపీవో ఉన్నారు.

## మొక్కజొన్న పంట ధ్వంసం

కుభీర్, సెప్టెంబర్ 3: జుండ గ్రామ శివారులోని పార్డి(బీ)కి చెందిన రైతు జంగల లక్ష్మి అనే రైతు మూడు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు సోమవారం రాత్రి ధ్వంసం చేశాయి. దీంతో రైతు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

## జిల్లాలో 28.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 3 : నిర్మల్ జిల్లాలో గడిచిన 24 గంటల్లో 28.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా నిర్మల్ రూరల్‌లో 86.8 మిల్లీ మీటర్లు నమోదు కాగా అత్యల్పంగా తానూర్‌లో 3.2 మి.మీ నమోదైంది. ఆయా మండలాల్లో కుబీర్‌లో 6.2, బాసర 9.2, ముథోల్ 9.2, భైంసా 8.6, కుంటాల 41.2, నర్సాపూర్(జీ) 9.6, లోకేశ్వరం 4.2, దిలావర్పూర్ 16.2, సారంగాపూర్ 40, నిర్మల్ 63.6, సోన్ 32.8, లక్ష్మణచాంద 39.2, మామడ 38.6, పెంబి 35.2, ఖానాపూర్ 24.4, కడెం 53.6, దస్తూరాబాద్ 16.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

## కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న వైద్యులు కళ్లెం వెంకట్‌రెడ్డి

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : జన్మదినం సందర్భంగా ఆర్భాటలకు వెళ్లకుండా సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు కళ్లెం వెంకట్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా 21మంది పేద మహిళలకు మంగళవారం తన దవాఖానలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డితో కలిసి డీఎస్పీ రూ.లక్ష 47 వేలతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం వివిధ సామాజిక కార్యక్రమాల్లో రాణిస్తున్న ఉపాధ్యాయులను డీఎస్పీ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ వైద్యుడు వెంకట్ తన పుట్టిన రోజు సందర్భంగా పేదమహిళలకు ఉపాధి కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గత పుట్టిన రోజు సందర్భంగా కూడా 50 సైకిళ్లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళ్లెం భూమారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, తెలంగాణ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

## గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం హిందూ సమాజ్ ఉత్సవ సమితి సభ్యులు ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. సమితి ఆధ్వర్యంలో రూపొందించిన లోగోను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మండ్లు, లెనిన్, భాస్కర్ గౌడ్, ఉదయ్, విశ్వనాథ్, రాజకుమార్, నర్సింగ్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

## కేబుల్ నెట్‌వర్కర్స్ ఏజెన్సీలతో సమావేశం

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ కేబుల్ నెట్‌వర్కర్స్ ఆపరేటింగ్ ఏజెన్సీలతో మంగళవారం జిల్లా ఎస్ఈ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ జేఆర్ చౌహాన్ మాట్లాడుతూ అన్ని నెట్‌వర్కర్ కేబుళ్లకు ఒక్క స్లీవ్‌ను గట్టిగా బిగించి ఒకటిగా కట్టుకోవాలని సూచించడం జరిగిందన్నారు. వారం రోజుల్లో విద్యుత్, ఏజెన్సీ సిబ్బంది జాయింట్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కేబుల్ ఆపరేటింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన

బాసర, సెప్టెంబర్ 3 : ట్రిపుల్‌ఐటీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఇందలో భాగంగా ప్రత్యేక ఉపన్యాసకుల శ్రీకాంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్‌కుమార్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ విపత్తుగా పరిగణించాలి

- రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి
- మాజీమంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



బేల: నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



తాంసి: పత్తి పంటను పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

జైనథ్, సెప్టెంబర్ 3 : ఆదిలాబాద్ నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పెన్‌గంగ వరదలతో పంట నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం జైనథ్ మండలం కరంజి గ్రామంలో పెన్‌గంగ వరద వల్ల నష్టపోయిన పత్తి, సోయా, కంది పంటలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జైనథ్, బేల మండలాల్లోని పెన్‌గంగ వరద వల్ల పది వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ విపత్తుగా ప్రకటించి ఎకరానికి రూ.40 వేలు నష్ట పరిహారం రైతులకు అందించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఒక మంత్రి బాధ్యతగా ఉన్న ఇన్‌చార్జి మంత్రికి పట్టింపులేదని, మంగళవారం వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు పంట నష్టపోయన గ్రామాలను సందర్శించకుండా డొల్లార పెన్‌గంగను చూసి వెళ్లిపోవడం ఏమిటని ప్రశ్నించారు. కౌలు రైతును ఆదుకుంటామన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయక రైతు భరోసా రాక వారిని తీవ్రంగా మోసం చేసిందని వాపోయారు. ప్రభుత్వం ఇచే ఎకరాకు రూ.10 వేలతో ఏమవుతుందని అన్నారు. బ్యాంకర్ల సమక్షంలో రూ.39 వేల కోట్లతో ఇచ్చిన మాట ప్రకారంగా రైతులు తీసుకున్న రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మాజీ ఎంపీపీ గోవర్ధన్,కరంజి మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు నారాయణ, మెట్టు ప్రహ్లాద్, డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, గణేశ్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

బేల, సెప్టెంబర్ 3 : పెన్‌గంగ పరివాహక ప్రాంతాల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బేల మండలంలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలతో నీట మునిగిన పంటలను బాధిత రైతులతో కలిసి మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించారు. పంట నష్టపోయిన తీవ్రతను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఉండడంతో కాస్త రైతులకు ఉపయోగపడే హామీలు ఇస్తారేమోనని ఎదురూ చూసిన వారికి నిరాశకు గురి చేశారన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతుల పక్షాన నలబడాల్సింది పోయి అధికార పార్టీ మంత్రులతో కమీషన్లు వస్తాయేమో అన్న భ్రమలో సీసీ పరిశ్రమపై అధికార పార్టీ ఎమ్మెల్యేలతో చెయ్యి కలపడం రైతాంగానికి తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తుందన్నారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, యువనాయకులు సతీశ్ పవార్, సీనియర్ రైతు సమన్వయ అధ్యక్షుడు రమేశ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, నారాయణ, దేవన్న, తేజారావ్, మధుకర్, జితేంద్ర బెదుర్కర్, మంగేశ్ ఠాక్రే, విపిన్ ఖోడే, సునీల్, ఆకాశ్ గుండావార్, విశ బూల్ గోడే, చౌహాన్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

### రైతులకు నష్టపరిహారం అందించాలి

తాంసి, సెప్టెంబర్ 3: పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోని పరిహారం అందించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. వర్షాల కారణంగా కప్పర్ల గ్రామంలో దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అధికారులు సర్వే చేపట్టాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్, వినోద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ప్రతి ఎకరాకు రూ.40 వేలు పరిహారం ఇవ్వాలి

భీంపూర్, సెప్టెంబర్3: భారీ వర్షాలు, వరదలతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ప్రతి ఎకరాకు రూ. 40 వేల పరిహారం సర్కారు చెల్లించాలని డిమాండ్ చేశారు. భీంపూర్ మండలం పెన్‌గంగ పరివాహక అర్లి(టీ), ఇందూర్‌పల్లి, మందపల్లి, అంతర్గాం శివార్లలోని ముంపు చేన్లను బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులను ఎమ్మెల్యే స్థానికులు వాదిస్తున్నా దాటారు. ముంపులో ఉన్న పత్తి, కంది చేన్లను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అర్లిలో వాడల్లో తిరుగుతూ కూలిన ఇళ్లు, కొట్టాలు పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు గోవర్ధన్‌యాదవ్, లస్మన్న, నరేందర్, ఉల్లాస్‌రావు దేశ్‌ముఖ్, నితిన్, కల్చాప్‌యాదవ్, కపిల్, జహూర్‌అహ్మద్, బాదర్, లింబాజీ, వంశీ, అనిల్, ముకుందసంతోష్, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 3 : భారీ వర్షాల నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండలంలోని వడగాం, పాటగూడ, మర్కాగూడ, లాల్‌టేకడి, అంజి గ్రామాలను సందర్శించారు. కోతకు గురైన వాటిని పరిశీలించారు. వరద ప్రవహంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతకు గురైన రోడ్లు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్, సెప్టెంబర్ 3 : నార్నూర్, గాదిగూడ మండలాల్లో మంగళవారం ఉదయం నుంచే ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నార్నూర్‌లో దన్నుగూడ, చిత్తగూడ, బారిక్‌రావ్‌గూడ, గాదిగూడలోని మారుగూడ, కునికసా ఒర్రెలపై వరద ప్రవహించింది. ఆ గ్రామంలోని ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన

కుంటాల, సెప్టెంబర్ 3 : వెంకూర్‌లో దెబ్బతిన్న పంటలను మంగళవారం డీఏవో అంజిప్రసాద్ పరిశీలించారు. వెంకూర్ చెరువుకు అలుగు లేకపోవడంతో వాగు వరద ఉధృతితో ఉప్పొంగి పరివాహక ప్రాంత పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ఈ సమస్యను పై అధికారులకు నివేదిస్తామని అన్నారు. ఇక్కడ ఏఈవో గణేశ్, గ్రామస్తులు ఉన్నారు.

### నీట మునిగిన పంటలు

బేల/బోథ్/ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 3: కురుస్తున్న వర్షాలకు బేల మండలంలోని సాంగిడి, గూడ, మణియార్‌పూర్, మాంగ్రూడ్, ఖోగ్దూర్ , బోథ్ మండలం బోథ్, సొనాల, ధన్నూర్(బీ) వాగు, అందూర్, నక్కలవాడ, పార్డి(బీ) గ్రామాల్లో సోయా, పత్తి, కంది, మినుము పంటలు నేలకొరిగాయి. ఉట్నూర్ మండలం గంగన్నపేట్‌లోని వరి పొలాలలో వరద ప్రవాహానికి ఇసుక మేటలు వేశాయి. సర్కారు ఇకనైనా అధికారులను పంపించి సర్వే చేయించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పురాతన బావి పరిశీలన

భీంపూర్, సెప్టెంబర్ 3 : భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామంలో శతాబ్దం కిందటి పురాతన మెట్ల బావిని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. వీలైతే బావిని బాగుచేయించి పైన రక్షణ వలయం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

### కోతకు గురైన వాటికి మరమ్మతులు చేయాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 3! భారీ వర్షాలకారణం కోతకు గురైన రోడ్లతోపాటు కల్వర్టులు, బ్రిడ్జిలు, బీటీరోడ్లకు మరమ్మతులు చేయాలని డీఆర్డీవో సాయన్న అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో వరద నీటితో కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల పూర్తి వివరాలను గ్రామపంచాయతీల వారీగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సమీర్‌హైమద్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల సందర్శన



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, సెప్టెంబర్ 3: కంటేగాం, బాబెర తండా, మర్లపల్లి, నక్కలవాడ గ్రామాల్లో సోమవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పర్యటించారు. కురిసిన భారీ వర్షాలకు నిరుపేద కుటుంబం దత్తు ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తహసీల్దార్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. నక్కలవాడ వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతు భరోసా ఇంత వరకు రాలేదని, భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని రైతులు మాజీ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట నాయకులు శ్రీధర్ రెడ్డి, బొడ్డు శ్రీను, దేవేందర్ రెడ్డి, ఆడె బాబు సింగ్, కాశీనాథ్, సురేశ్, గ్రామస్తులు, రైతులు ఉన్నారు.

## వృద్ధురాలిని చితకబాదిన ఇరుగుపోరుగు వారు

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 3: మోర్కండి గ్రామంలో మంత్రాల నేపంతో వృద్ధురాలిని చితకబాదిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం..మోర్కండి గ్రామానికి చెందిన సర్పె బాయబాయి (65) గత కొంత కాలంగా చేతబడి చేస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆదివారం గ్రామంలోని మునేశ్వర్ ప్రతాప్ వాళ్ల ఇంటి పైన నిమ్మకాయలు, పసుపు, కుంకుమ వంటి చేతబడి వస్తువులు వేశారనే నేపంతో, అనుమానంతో సర్పే బాయబాయి మాంత్రాలు చేస్తుందని ఇరుగు పోరుగువారైన మునేశ్వర్ ప్రతాప్, మునేశ్వర్ అరుణ, గంగారం,లక్ష్మి దాడి చేశారు. బాధితురాలి తరపున కానిందె లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మల్లికార్జున స్వామి ఆలయం చుట్టు నీరు



ఆలయం చుట్టు నిండిన వర్షపు నీరు

ఇచ్చోడ, సెప్టెంబర్ 3: మండలంలోని సిరిచెల్మ గ్రామంలోని పురాతన మల్లికార్జున స్వామి ఆలయం చుట్టు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు చేరింది. దీంతో భక్తులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు పడవలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలి

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 3 : బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని శ్యాంపూర్ గ్రామానికి చెందిన రైతులు అన్నారు. మంగళవారం రుణమాఫీ కాని రైతులు తాము రుణాలు తీసుకున్న పత్రాలు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమలో రైతులు కేంద్రే సదానంద్, నారాయణ, దత్త, గంగారాం పాల్గొన్నారు.

## వరద నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

బోథ్, సెప్టెంబర్ 3: మండలంలో భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. మంగళవారం ధన్నూర్(బీ) వాగు ప్రవాహనికి కోతకు గురైన కల్వర్టులను, రోడ్డును పరిశీలించారు. ఫోన్ ద్వారా ఉన్నతాధికారులతో సమస్య తీవ్రతను తెలిపిన వెంటనే వర్షాలు తగ్గుముఖం పట్టగానే నూతన కల్వర్టుల మంజూరు, రూ.2 లక్షలతో మరమ్మతులు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ గోర్ల రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్మ వినయ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాళ్ల ఇంద్రారెడ్డి, మైనార్టీ సీనియర్, నాయకులు షేక్ అబుద్, నితిన్, సోయల్ ఉన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి

ఇచ్చోడ, సెప్టెంబర్ 3 : వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రోగ్రామ్ జిల్లా శిక్షణ బృందం డాక్టర్ నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం దుబార్‌పేట్‌లో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించి ఫీవర్ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్, సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో మేకలు మృతి

గుడిహత్నూర్,సెప్టెంబర్ 3 : గుడిహత్నూర్ మండలం గురుజ గ్రామ పరిసర ప్రాంతంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో ఐదు మేకలు మృతి చెందాయి. గురజ గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ 3, మాజీ సర్పంచ్ గోవింద్ 1, గోడం సతీశ్ 1, సోనేరావ్1 మేకలు మేతకు తీసుకెళ్లగా కిందపడి ఉన్న విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందాయి. ఈ విషయం విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లామని మాజీ సర్పంచ్ జాదవ్ గోవింద్ తెలిపారు. విద్యుత్ శాఖ వారు నష్ట పరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు.

## పోస్టాఫీస్‌లో చోరీకి యత్నం

ఇచ్చోడ, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో సోమవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. బీరువాలో, కౌంటర్లు పగలగొట్టారని ఎస్ఐ భీమేశ్ తెలిపారు. ఎలాంటి నగదు చోరీ కాలేదని తెలిపారు. 20 రోజుల క్రితం ఇదే పోస్టాఫీస్‌లో నగదు, స్టాంపులు చోరీకి చేశారు. అప్పట్లో సిబ్బందికి సీసీ కెమెరాలు అమర్చాలని తెలపగా వారు బిగించుకోక నిర్లక్ష్యం చేశారని, సీసీ కెమెరాలు అమర్చుకోవాలని నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## సకాలంలో స్పందించిన ఎంపీడీవో



గుండాల లక్ష్మిని బంధువుల ఇంటిలో ఉంచిన ఎంపీడీవో

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 3: బాబాపూర్ గ్రామానికి చెందిన గుండాల లక్ష్మి బాలింతరాలు. ఇటీవల ఎంపీడీవో రాధిక బాబాపూర్ గ్రామాన్ని సందర్శించినప్పుడు వారి ఇల్లు శిథిలావస్థ దశలో ఉంది. దానిని గమనించిన ఆమె ప్రమాదకరమని ఆ ఇంటిని ఖాళీ చేయాలని సూచించారు. కాని కుంటుంబ సభ్యులు ఎంపీడీవో మాటను లెక్క చేయలేదు. కాని ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎంపీడీవో రాధిక సోమవారం బాబాపూర్ గ్రామాన్ని సందర్శించారు. భారీ వర్షాలకు ఇల్లు కూలిపోతుందని తప్పనిసరిగా ఖాళీ చేయాలని సూచించి వారిని వారి బంధువుల ఇంటిలో ఉంచారు. సోమవారం రాత్రి ఆ ఇల్లు కూలిపోయింది. ఎంపీడీవో రాధిక చూపిన చొరవతో గుండాల లక్ష్మితో పాటు, ఆమె తల్లి కూడా ఇల్లు కూలి మరణించే వారు. ఎంపీడీవో చూపిన చొరువ, ముందు జాగ్రత్త మూడు ప్రాణాలను కాపాడింది. గుండాల లక్ష్మిని ఇల్లు ఖాళీ చేయించడంలో ఆమె వెంట ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి చందు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకులపై దాడి హేయమైన చర్య

ఖానాపూర్ టౌన్ , సెప్టెంబర్ 3: ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీమంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రరెడ్డి వాహనాలపై కాంగ్రెస్ నాయకులు రాళ్ల దాడి చేయడం హేయమైన చర్య అని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సాయం చేయడం చేతగాక , సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేక ఈ దాడికి తెగబడ్డారని అన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొక్కుల ప్రదీప్ పాల్గొన్నారు.

## కుళ్లిపోయిన మాంసం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

నార్నూర్, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలో కుళ్లిపోయి నాసిరకం మాంసం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పెసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాసిరకం మాంసం విక్రయిస్తున్న సమయంలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక్కడ గోశాల వ్యవస్థాపకుడు ఆడే రాంనివాస్,యువకులు ఉన్నారు.

## గోదారమ్మకు శాంతి పూజ

బాసర, సెప్టెంబర్ 3 : బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో గల గోదారమ్మకు మంగళవారం అర్చకులు శాంతి పూజ నిర్వహించారు. ఎడ తెరపి లేకుండా కురుస్తున వర్షానికి బాసర వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ఉప్పొంగి ప్రవహిస్తుంది. కావున ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండాలని కోరుతూ ఆలయ అర్చకులు గోదావరి నది ఘాట్-1 వద్ద శాంతి పూజ కార్యక్రమం నిర్వహించారు.

## కొనసాగుతున్న ఆవిర్భావ వేడుకలు

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కేవీకేలో కొనసాగుతున్నాయి. అభివృద్ధి ప్రదర్శనను రైతులు తిలికించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్ డాక్టర్ మోహన్, శివచరణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

ఎదులాపురం,సెప్టెంబర్ 3 : హెచ్ఐవీ సోకిన తల్లి గర్భస్థ దశలో వైద్యుల సలహాలు పాటిస్తే పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ వచ్చే అవకాశాలు 0.2శాతం వరకు తగ్గించవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో గజానన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని హమాలివాడ పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాగర్జున, ఎంఅండ్ఈ సతీశ్, ఈఈ రాజేశ్వర్, సీవో రణీత, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## టీబీ కార్యాలయం తనిఖీ

ఎదులాపురం, సెప్టెంబర్ 3: ఆదిలాబాద్‌లోని టీబీ కార్యాలయాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో కృష్ణ తనిఖీ చేశారు. క్షయ నిర్ధారణకు సేకరిస్తున్న నమూనాల గురించి డీటీవో డాక్టర్ సాయిప్రియను అడిగి తెలుసుకున్నారు. టీబీకి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. రిమ్స్‌లో చేస్తున్న మలేరియా నిర్ధారణ పరీక్షల విభాగాన్ని సైతం పరిశీలించారు. బాధితులకు నిర్ధారణ పరీక్షల నివేదికలను త్వరగా అందించాలని సూచించారు. ఆయన వెంట డీఎంవో శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

## మంత్రికి మాండగడ రైతుల వినతి

జైనథ్, సెప్టెంబర్ 3 : డొల్లార వద్ద పెన్‌గంగ వరద ఉధృతిని పరిశీలించడానికి వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం 44వ జాతీయ రహదారి మాండగడ ఎక్స్‌రోడ్డు వద్ద మండలంలోని మాండగడ గ్రామ రైతులు మంత్రి కాన్వాయ్‌ని ఆపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుకు గ్రామ రైతులు లిఖిత పూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామ ఆదర్శ రైతు ముక్కెర ప్రభాకర్ మాట్లాడుతూ డొల్లార శేఖాపూర్ శివారులో మాండగడ గ్రామానికి చెందిన రైతుల భూములు 500 ఎకరాలు ఉన్నాయన్నారు. పెన్‌గంగ వరద ఉధృతికి మండలంలోని సాత్నాల నది బ్యాక్ వాటర్‌తో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. తమ భూముల పంటలపై సమగ్ర సర్వే చేసి ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు మంత్రి శ్రీధర్ బాబుకు తమ గోడును విన్నవించారు. మంత్రి వెంట ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాండగడ రైతులు ఉన్నారు.

## స్తంభించిన జన జీవనం

తలమడుగు, సెప్టెంబర్ 3: మండలంలో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి తలమడుగు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ రాజమోహన్, ఎస్ఐ అంజమ్మ బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీ వర్షంతో పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భీంపూర్, సెప్టెంబర్3: పెన్‌గంగ పరివాహక గుబిడి, కొజ్జన్‌గూడ , టేకిడిరాంపూర్ ,కరంజి(టీ), అంతర్గాంలలో పంట నష్టం తీవ్రత ఎక్కువగా ఉన్నది. తహసీల్దార్ నారాయణరావు, డీటీ హరిదాస్, ఎస్ఐ కలీంలు సిబ్బందితో కలిసి పెన్‌గంగ పరివాహక గ్రామాల్లో తిరుగుతూ అప్రమత్తం చేస్తున్నారు.

## పలు ఇండ్లు ధ్వంసం

కుంటాల, సెప్టెంబర్ 3: అందకూర్, కుంటాలలో పలు ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. మండల కేంద్రంలో కే ప్రకాశ్‌కు చెందిన ఇల్లు మంగళవారం అర్ధరాత్రి పాక్షికంగా ధ్వంసం కాగా గ్రామానికి చెందిన డీ వెంకటేశ్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు.

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో న్యూలోలం గ్రామంలో కన్న ముత్తన్న, షేక్ హుస్సేన్‌కు చెందిన ఇండ్లు కూలిపోయాయి. వీటిని మంగళవారం ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పరిశీలించారు.

## తెగిపోయిన రోడ్డు.. నిలిచిన రాకపోకలు

ఇచ్చోడ, సెప్టెంబర్ 3: సిరికొండ మండలంలో వాయిపేట్ వెళ్లే మార్గంలో రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జాతీయ హిందీ దినోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : ఆదిలాబాద్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో హిందీ భాష సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు హిందీ దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, ఉపాధ్యక్షుడు రవి జాబడే, ప్రచార కార్యదర్శి సాంబన్న, కార్యవర్గ సభ్యులు జావిద్ అలీ పాల్గొన్నారు.

## ఝరి(బీ) వాగును పరిశీలించిన అధికారులు

తానూర్, సెప్టెంబర్ 3 : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఝరి(బీ) గ్రామం వద్ద గల వాగు పొంగి పొర్లడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం పంచాయతీరాజ్ డీఈ కమలాకర్, ఏఈ తోఫిక్ వాగును పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని డీఈ కమలాకర్ తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి జాదవ్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ శివదాస్, గ్రామస్తులు ఉన్నారు.

## మత్తడి ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

తాంసి, సెప్టెంబర్ 3: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా తాంసి మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరడంతో మంగళవారం మూడు గేట్లు ఎత్తి నీటిని వదిలినట్లు ప్రాజెక్టు అధికారి హరీశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 అడుగులు కాగా ప్రస్తుతం 2760.70 అడుగులు ఉందని, ఇన్‌ఫ్లో 17808 క్యూసెక్కుల కాగా ఔట్ ఫ్లో 18100 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. దిగువన ఉన్న నది పరివాహక ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు అటు వైపు వెళ్లొదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## సంచార పుస్తక వాహనం ప్రారంభం

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,3: బాల సాహిత్య పుస్తకాల వల్ల విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తి పెరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార పుస్తక వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, డీఈవో రవీందర్‌రెడ్డి, రూమ్ టూ రీడ్ జిల్లా ఇన్‌చార్జి రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకరికి మూడు నెలల జైలు శిక్ష

నిర్మల్ అర్బన్/దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3: యువతిని వేధించిన కేసులో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఎడ్డన్నోల్ల శ్రీనివాస్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు నిర్మల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి అజయ్ కుమార్, దిలావర్‌పూర్ ఎస్ఐ రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. 2018 సంవత్సరంలో ఓ యువతి కళాకృత్యలు వెళ్తుండగా ఎడ్డన్నోల్ల శ్రీనివాస్ ఆమె వెంట పడి పోదల్లోనికి తీసుకెల్లి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడే ప్రయత్నం చేశాడు. అతని నుంచి ఇంటికి వచ్చి తన కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేశారు. కాగా సాక్షులను అన్నింటిని పరిశీలించిన పిదప కోర్టు అతనికి మూడు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

## మహిళ ను కాపాడిన పోలీసులు

సోన్, సెప్టెంబర్ 3: నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీకి చెందిన సునీత మనస్థాపం చెంది మంగళవారం ఆత్మహత్య చేసుకునేందుకు దగ్గరలోని బావిలో దూకేందుకు వెళ్తుండగా పోలీసులు కాపాడారు. నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన సునీత మనస్థాపం చెంది బావిలో దూకేందుకు వెళ్తుందని 100 డయల్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే కానిస్టేబుల్ రవిశంకర్, శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య చేసుకోకుండా ఆమెను కాపాడి కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 3: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బీజేపీ సభాపక్షనేత, నిర్మల్ ఎమెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమెల్యే నివాసంలో నిర్మల్ నియోజిక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీలను అందజేశారు. కార్యక్రమంలో ముథోల్ ఎమెల్యే రామారావు పటేల్, నాయకులు సత్యనారాయణ గౌడ్, బాపురెడ్డి పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల దూరం

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3 : పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్‌లో మహిళా సంఘాల సభ్యులు, అధికారులతో కలిసి సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, ఏపీవో దివ్యరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.